## ఓపెన్ స్కూల్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 15 : జిల్లాలో ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాస్తున్న వారంతా శ్రద్ధతో చదివి నూరు శాతం ఫలితాలు సాధించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్, పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 20 నుంచి నిర్వహించనున్న ఇంటర్, పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఫీజు చెల్లించిన విద్యార్థులంతా తప్పక హాజరుకావాలని సూచించారు. పదో తరగతిలో 421 మంది, ఇంటర్‌లో 881 మంది ఓపెన్ స్కూల్ విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు తెలిపారు. కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, జిల్లా సైన్స్ ఆఫీసర్ జైపాల్ రెడ్డి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సీహెచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## భూ భారతిపై అవగాహన కల్పించాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 15: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూభారతి చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఇందుకోసం గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కొత్త రెవెన్యూ చట్టంపై తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలు క్రోడీకరించి, ప్రభుత్వం చట్టం రూపొందించిందన్నారు. సదస్సుల నిర్వహణకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, నేటి నుంచి అన్ని మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు షెడ్యూల్ రూపొందించాలని ఆదేశించారు.

***ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలి***

జిల్లాలోని అన్ని మండలాల్లో పైలట్‌గా ఎంపిక చేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారులతో చర్చించి ఇండ్ల నిర్మాణం త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీకిరణ్, ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## మంచినీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలి

కార్పొరేషన్, ఏప్రిల్ 15: నగరంలో మంచి నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలోని అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. విలీన గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాపై ప్రజల నుంచి చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, సమస్యను త్వరగా పరిష్కరించాలన్నారు. నీరు సరఫరా కానీ ప్రాంతాలు ఏమైనా ఉంటే ట్యాంకర్స్ ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీ ఎంఎస్ బాక్సుల్లో వీధి దీపాల సమయ వేళలను మార్చాలన్నారు. నగరంలోని ప్రధాన స్టార్మ్‌వాటర్ డ్రైనేజీల్లో సిల్ట్ తొలగింపునకు చర్యలు చేపట్టాలని, వెంటనే డీ సిల్టింగ్ ప్రక్రియకు టెండర్లు పిలువాలని ఆదేశించారు. సమావేశంలో ఈఈలు యాదగిరి, సంజీవ్, డీఈలు లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఓం ప్రకాశ్, ఏఈలు సతీశ్, గట్టు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## 19న ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు

కొత్తపల్లి, ఏప్రిల్ 15 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉమ్మడి జిల్లా సీనియర్స్ పురుషుల, మహిళల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్లు, బసరవేని లక్ష్మణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తపల్లిలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ఈ ఎంపిక పోటీలు కొనసాగుతాయని, వీటిలో పాల్గొనే క్రీడాకారులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఒరిజినల్ ఆధార్ కార్డుతో రావాలని తెలిపారు. ఇతర వివరాలకు 9441925807 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# రజతోత్సవ సభకు కదలిరావాలి

- పోస్టర్ ఆవిష్కరణ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి



వంకాయగూడెంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి

శంకరపట్నం, ఏప్రిల్ 15: ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు బీఆర్ఎస్ శ్రేణులు కదలిరావాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. ఎల్కతుర్తి రజతోత్సవ బహిరంగ సభ సన్నాహక సమావేశంలో భాగంగా వంకాయగూడెం మాధవసాయి గార్డెన్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రసమయి మాట్లాడుతూ.. ఎల్కతుర్తి రజతోత్సవ బహిరంగ సభ కనీ వినీ ఎరుగని రీతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. శంకరపట్నం నుంచి 2 వేల మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. బస్సులతో సహా బహిరంగ సభకు కావాల్సిన ఏర్పాట్లన్నీ ఇప్పటికే పూర్తి చేసినట్లు స్పష్టం చేశారు. గ్రామ గ్రామాన పార్టీ జెండాలు ఆవిష్కరించి, మధ్యాహ్న సమయం నుంచే సభకు బయలుదేరాలన్నారు. అనంతరం ఎల్కతుర్తి రజతోత్సవ సభ సక్సెస్‌పై పార్టీ శ్రేణులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట మహిపాల్, మాజీ జడ్పీటీసీలు పొద్దుటూరి సంజీవరెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు పల్లె సంజీవరెడ్డి, మొత్కూరి సమ్మయ్య, పెద్ది శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మెంతల సతీశ్‌రెడ్డి, చౌడమల్ల వీరస్వామి, అంతం తిరుపతిరెడ్డి, గుర్రం రామస్వామి, కాటం వెంకటరమణారెడ్డి, గాండ్ల తిరుపతయ్య, మోరె శ్రీనివాస్, గోపు విజయ్‌కుమార్‌రెడ్డి, కిషన్‌రావు, హన్మంతు, కొత్తపల్లి రవి, నెలవేని మహేశ్, గుర్రం శ్రీకాంత్, భూమ సంపత్, నర్సింహారెడ్డి, బొజ్జ రవి, శ్యాంరావు, రవి, పార్థసారథి, మేకల కుమార్, సుధాకర్, శ్రీనివాస్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మరో తడి ఇచ్చి పంటలు కాపాడండి



మక్త గ్రామ శివారులో నీటి తడి లేక ఎండుతున్న వరి పైర్లు

శంకరపట్నం, ఏప్రిల్ 15: మరో తడి కాలువ నీటిని ఇచ్చి ఎండుతున్న పంటలను కాపాడాలని పలువురు రైతులు కోరారు. మంగళవారం మక్త గ్రామ శివారులో పాలు పోసే, గింజ దశలో ఉన్న తమ వరి పైర్లను చూపుతూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కాలువ నీరు ఆలస్యంగా అందడం వల్ల నాట్లు వేయడం ఆలస్యం అయిందని తెలిపారు. సాగు నీరు అందకపోతే తమ చుట్టు పక్కల దాదాపు 50 ఎకరాల్లో పంటలు ఎండే ప్రమాదం తలెత్తిందన్నారు. ప్రభుత్వం ఎలాగైనా ఒకటి, రెండు నీటి తడులు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని గ్రామానికి చెందిన రైతులు నెలవేని సంపత్, నెలవేని పరశురాములు, నెలవేని రాజయ్య, నెలవేని సంజీవ్, దొంతుల సంపత్, తదితరులు విజ్ఞప్తి చేశారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 15 : ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, పొరుగు సేవల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ కలెక్టర్‌ను కోరింది. జిల్లాలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులతో కలిసి ఆ సంఘం జిల్లా ప్రతినిధులు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇతర రాష్ట్రాల్లోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కార్పొరేషన్ ద్వారా వేతనాలు చెల్లిస్తున్న మాదిరి, తెలంగాణ రాష్ట్రంలో కూడా అనుసరించాలని ప్రభుత్వానికి లేఖ రాయాలని విజ్ఞప్తి చేశారు. నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉండడం మూలంగా తమ కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి ప్రతి నెలా ఒకటో తేదీన తమ బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ ఏజెన్సీల ద్వారా నియామకమైన తమకు వచ్చే వేతనాల్లో నిర్వాహకులు భారీగా కోతలు పెడుతున్నారని, ప్రభుత్వం ద్వారా వారికొచ్చే కమీషన్‌తో పాటు తమ వద్ద కూడా నెలనెలా కమీషన్లు లాగుతున్నారని ఆరోపించారు. నిర్వాహకుల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకే ఇతర రాష్ట్రాల్లో కార్పొరేషన్ ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీలుగుల రామ్మోహన్, పబ్బ కైలాసం, నర్సింగోజు రామకృష్ణ, కనపర్తి రాములు, వెదిర మల్లేశం, సీతారాంపూర్ మహిపాల్‌రావుతో పాటు పలువురు ఉన్నారు.

## వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 15 : ఇటీవల పార్లమెంట్ ఉభయసభల్లో ఏకపక్షంగా సవరించిన వక్ఫ్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, ముస్లిం పర్సనల్ లాబోర్డు సభ్యుడు మహ్మద్ అసిఫ్ పాషా డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఇమామ్‌ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, వక్ఫ్ సవరణ చట్టం ప్రకారం వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను కూడా సభ్యులుగా చేర్చడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ముస్లింల భద్రత ప్రశ్నార్థకమయ్యేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. వక్ఫ్ ఆధీనంలో ఉన్న భూములను క్రమేపి ప్రభుత్వం లాక్కొని, ముస్లింల మనుగడకు ముప్పు తెచ్చే తీరును ప్రదర్శిస్తున్నదని ధ్వజమెత్తారు. వెంటనే కేంద్రం సవరించిన వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. సమావేశంలో ముస్లిం నాయకులు మహ్మద్ రజాక్, ఇంతియాజ్, రజబ్‌అలీ, షకూర్, సయ్యద్ సలీంతో పాటు పలువురు ఇమామ్‌లు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

## 'కొడుకు, కోడలు ఇంట్లోంచి గెంటి వేశారు'



కేశవపట్నం పోలీస్ స్టేషన్ వద్ద ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న ఐలయ్య

శంకరపట్నం, ఏప్రిల్ 15: కొడుకు, కోడలు తనను ఇంట్లోంచి గెంటి వేశారని, తనకు న్యాయం చేయాలని రాజాపూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ ఆసరి ఐలయ్య కేశవపట్నం ఠాణా మెట్లెక్కాడు. ఆయన కథనం ప్రకారం.. వృద్ధుడైన ఐలయ్యకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు కాగా, భార్య సారమ్మ, చిన్న కొడుకు గణపతి కొన్నాళ్ల క్రితం చనిపోయారు. ఐలయ్యకు ఇల్లు, నాలుగెకరాల పొలం ఉండగా, పొలం కొడుకు సదయ్య తన పేరున మార్చుకున్నాడు. ప్రస్తుతం కొడుకు సదయ్య, కోడలు సారమ్మ తిండి పెట్టకుండా ఐలయ్యను ఇంట్లోంచి బయటకు గెంటి వేయడంతో వృద్ధాప్యంలో అవస్థలు పడుతున్నాడు. రాత్రి పూట పాఠశాల ఆవరణలో పడుకుంటున్నట్లు ఐలయ్య వాపోయాడు. తనకు పోలీసులు, అధికారులు న్యాయం చేయకపోతే చావే శరణ్యమని రోదిస్తూ చెప్పాడు.

## విద్యార్థులు మంచి నడవడిక అలవర్చుకోవాలి

కోర్టుచౌరస్తా, ఏప్రిల్ 15: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వెంకటేశ్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం (షెడ్యూల్డ్ కులాలు)ను సందర్శించి చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు, ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, విద్యార్థులు మంచి నడవడికను అలవర్చుకోవాలని సూచించారు. వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వసతి గృహం నిర్వాహకులు పాల్గొన్నారు.

## పరిపాటిని పరామర్శించిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



పోతిరెడ్డిపల్లిలో పరిపాటి రవీందర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, ఏప్రిల్ 15: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పరిపాటి రవీందర్‌రెడ్డి కుమార్తె హర్షిత రెడ్డి అమెరికాలో ఇటీవల అకాల మృతిచెందగా, కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించారు. పోతిరెడ్డిపల్లి గ్రామంలోని పరిపాటి రవీందర్‌రెడ్డి ఇంటికి ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి వచ్చారు. ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇక్కడ మాజీ ఎంపీపీలు ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, పావని-వెంకటేశ్, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, సీనియర్ నాయకులు రమేశ్, దిలీప్, శ్రీకాంత్, భరత్, తదితరులు ఉన్నారు.

## పొన్నం అనిల్ గౌడ్‌కు పరామర్శ

తిమ్మాపూర్ రూరల్, ఏప్రిల్ 15: మన్నెంపల్లికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ అమ్మమ్మ బాలవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, మంగళవారం ఆయనతోపాటు కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్ రెడ్డి పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## హుజూరాబాద్ హాకీ క్లబ్ నూతన కార్యవర్గం



రాజేంద్ర ప్రసాద్, అధ్యక్షుడు

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 15: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని హాకీ క్లబ్ ఆవరణలో మాజీ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, గుడ్డేలుగుల సమ్మయ్య ఆధ్వర్యంలో మంగళవారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోట రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా బొడిగ తిరుపతి గౌడ్, ఉపాధ్యక్షులుగా భూసారపు శంకర్, ఆరెల్లి రమేశ్, వేముల రవికుమార్, ఎండీ యూసుఫ్, జాయింట్ సెక్రటరీలుగా శ్యాంసుందర్, సీహెచ్ రాజు, జీ ప్రదీప్, ఎన్ సాయి కృష్ణ, ట్రెజరరీగా ఎం రాజేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కే రాజేశ్, ఎస్. విక్రమ్, యు. భాస్కర్ రెడ్డి, ఎం. వినయ్, పి. సాంబరాజు, కోచ్‌గా ఎం విక్రమ్, సలహాదారులుగా జి. సమ్మయ్య, పవన్ కుమార్, బీ రఘు, సీహెచ్ శ్రీనివాస్, కే భిక్షపతి, జాని, నల్ల బాలరాజు, కార్యవర్గ సభ్యులుగా పరబ్రహ్మం, సన్నీ, వినీత్, విపుల్, రోహన్, రాజకుమార్, వంశీ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు సజ్జు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## డీఈవో ఆఫీసు పైనుంచి పడి అటెండర్ దుర్మరణం

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 15 : కరీంనగర్ డీఈవో కార్యాలయంలో అటెండర్ కం నైట్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్న గడప రవీందర్ కుమార్ (59) ప్రమాదవశాత్తు ఇదే కార్యాలయం పైనుంచి పడి దుర్మరణం చెందాడు. అతడి భార్య ఉమ పోలీసులకు ఫిర్యాదు చేసిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని కట్ట రాంపూర్‌కు చెందిన రవీందర్ కుమార్ గత 28 ఏండ్లుగా విద్యాశాఖలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం కట్టరాంపూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ కరీంనగర్ డీఈవో కార్యాలయంలో డిప్యూటేషన్‌పై నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం బట్టలు ఉతికి కార్యాలయం పైఅంతస్తులో ఆరవేసుకున్నాడు. ఆరిన తర్వాత తీసుకు వచ్చేందుకు వెళ్లిన రవీందర్ కుమార్ ప్రమాదవశాత్తు పైఅంతస్తు నుంచి కిందపడ్డాడు. తల వెనుక భాగంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు.

## ఫ్లై ఓవర్‌పై వ్యాన్ ఢీకొని ఒకరి మృతి

జమ్మికుంట (హుజూరాబాద్ టౌన్), ఏప్రిల్ 15: జమ్మికుంట పట్టణంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పురంశెట్టి తిరుపతి (40) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. జమ్మికుంట పట్టణంలోని దుర్గా కాలనీకి చెందిన పూరంశెట్టి తిరుపతి మంగళవారం బైక్‌పై పట్టణంలోని ఫ్లైఓవర్‌పై ప్రయాణిస్తుండగా టీఎస్ 25 టీ 2940 నంబర్ గల డీసీఎం వ్యాన్ ప్రమాదవశాత్తు ఢీకొన్నది. వ్యాన్ చక్రాల కింద తల నుజ్జునుజ్జవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సృజనతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జమ్మికుంట సీఐ రవి పేర్కొన్నారు.

## మహాసభలను విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 15: హైదరాబాద్ శంషాబాద్‌లో ఈ నెల 21,22 తేదీల్లో జరుగనున్న రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాలుగో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య కార్మిక శ్రేణులకు పిలుపునిచ్చారు. నగరంలోని యూనియన్ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవనంలో మంగళవారం మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బుచ్చన్నయాదవ్, నాయకులు సదానందం, ఖాజపాషా, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఏప్రిల్ 15: విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, డీటీఆర్ పనులు చేపడుతున్నందున నగరంలోని పలు ప్రాంతాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1, 2, కరీంనగర్ రూరల్ ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, లావణ్య వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 8.30 నుంచి 10.30గంటల వరకు శక్తి టెంపుల్ ఏరియా, బాలాజీ సూపర్ మార్కెట్ ప్రాంతం, సంతోష్ నగర్, సంతోషి మాత గుడి, మహాలక్ష్మి నగర్, శ్రీనివాస్ నగర్, జయశంకర్ కాలనీ, శాతవాహన ఫార్మా మెడికల్ కాలేజ్, చర్చి ఏరియా, అంబేద్కర్ నగర్, శివాజీ నగర్, కిసాన్ నగర్, ఎస్టీ కాలనీ, రాం నగర్, శివాజీ నగర్, ప్రగతి నగర్, మార్కండేయ నగర్, సప్తగిరి కాలనీ, ఉదయం 9 నుంచి 10గంటల వరకు భగత్ నగర్, వాసుదేవ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, విఘ్నేశ్వర కాలనీ, అయోధ్య కాలనీ, ఉదయం 8నుంచి10గంటల వరకు పోచమ్మ గుడి, కోతి రాంపూర్, లక్ష్మీ నగర్, ఉదయం 7నుంచి 10 గంటల వరకు మెహర్ నగర్, వింధ్యావాలి స్కూల్, డీమార్ట్ ఎదురుగా ఉన్న ప్రాంతం, ఈఎన్ గార్డెన్, గౌడ హాస్టల్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

## అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా



అన్నారం కల్వర్ట్ వద్ద బోల్తా పడిన ట్రాక్టర్

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 15: అన్నారం గ్రామ శివారులో ఉన్న కల్వర్టు వద్ద మంగళవారం ధాన్యం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడగా, త్రుటిలో ప్రమాదం తప్పింది. గోపు చెన్నారెడ్డి అనే రైతు పోచంపల్లి నుంచి కరీంనగర్‌కు వరి ధాన్యాన్ని తరలిస్తుండగా, కల్వర్టు సమీపంలోని గుంతలతో అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఆ సమయంలో వెనుకా, ముందు భారీ వాహనాలు రాకపోవడం, ట్రాక్టర్ నడుపుతున్న రైతు సురక్షితంగా బయటపడ్డాడు. మరో వాహనంలో బస్తాలను తరలించారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం



గద్దపాక వైద్య శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

శంకరపట్నం, ఏప్రిల్ 15: గద్దపాక గ్రామంలో మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా హాస్పిటల్ వైద్యులు గ్రామానికి చెందిన 120 మందికి బీపీ, షుగర్, 2డీ ఈకో, తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురు రోగులకు అవసరమైన మందులు అందజేశారు. హాస్పిటల్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో తమ హాస్పిటల్ పని చేస్తున్నదన్నారు. వైద్యులతో పాటు మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, మనోజ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి: ఈడీ సోలమన్

తెలంగాణచౌక్, ఏప్రిల్ 15: ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలమన్ అధికారులను ఆదేశించారు. నగరంలోని బస్టాండ్ ఆవరణలో గల సమావేశం మందిరంలో మంగళవారం జోన్ పరిధిలోని ఆర్ఎం, డిప్యూటీ ఆర్ఎం, డీఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జోన్ పరిధిలోని ప్రతి డిపో నష్టాలను అధిగమించి ఆదాయన్ని ఆర్జించేలా చూడాలన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపించాలని సూచించారు. సమావేశంలో కరీంనగర్ ఆర్ఎం రాజు, డిప్యూటీ ఆర్ఎంలు భూపతిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, డీఎంలు శ్రీనివాస్, విజయమాధురితో పాటు జోనల్ పరిధిలోని ఆర్ఎం, డీఆర్ఎం, డీఎంలు పాల్గొన్నారు.




**CHANGE OF NAME**

I. Neerati Haarika W/o. Vishnuprasad, H.No. 11-83, Racharla Boppapur, Yellareddypet Mandal. Rajanna Sircilla Dist. My Name was Changed to Gattipally Thirumala D/o.Naga Bhooshanam.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.




## కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు

తెలంగాణచౌక్, ఏప్రిల్ 15: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను పోరాటాలతో అడ్డుకుంటామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ముకుందరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేశ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య హెచ్చరించారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఆల్‌ట్రేడ్ యూనియన్స్ సమావేశంలో వారు మాట్లాడుతూ, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం పాలన కొనసాగిస్తున్నదని ధ్వజమెత్తారు. ఈనెల 25న నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవనంలో నిర్వహించనున్న జిల్లా సదస్సు విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో వివిధ కార్మిక నాయకులు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, ఆగయ్య, కృష్ణ యాదవ్, ఆకుల మల్లేశం పాల్గొన్నారు.

## సమష్టి కృషితోనే 'సూయి జనరిస్' విజయవంతం

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 15 : అధ్యాపకులు, విద్యార్థుల సమష్టి కృషితోనే సూయి జనరిస్ విజయవంతమైందని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. కళాశాలలో సూయి జనరిస్ 2025 విజయోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడారు. అకడమిక్ కోఆర్డినేటర్ బి. సంపత్ కుమార్, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ ఆర్. కిరణ్ కుమార్, విద్యార్థులు, తమ అనుభవాలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్, రామేశ్వరరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్యేక కోర్సులో జిల్లావాసికి సర్టిఫికేట్

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 15 : జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ అట్ల శ్రీనివాస్ రెడ్డి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు కలిగిన గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ సెంటర్ ఫర్ విమెన్ అండ్ చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సర్టిఫికేట్ కోర్సు 'రిప్రొడక్టివ్ జస్టిస్ ఇన్ ఇండియా' పూర్తి చేసి సర్టిఫికేట్ అందుకున్నారు. గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సంజీవి శాంతకుమార్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ నితిన్ మాలిక్, సెంటర్ ఫర్ విమెన్ అండ్ చైల్డ్ రైట్స్ హెడ్ డాక్టర్ ఆశా వర్మ ఈ కోర్సులో 70 శాతం పైగా మార్కులు సాధించిన వారిని ప్రత్యేకంగా అభినందించి, సర్టిఫికేట్లు అందజేశారు.

## అక్రమ మద్యం ధ్వంసం

గన్నేరువరం, ఏప్రిల్ 15: తనిఖీల్లో భాగంగా పట్టుబడిన అక్రమ మద్యాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. మండలంలో 2023 నవంబర్‌లో అక్రమంగా తరలిస్తున్న 480మద్యం క్వాటర్ బాటిల్స్ సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం తిమ్మాపూర్ ఎక్సైజ్ సీఐ బాబా, ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మద్యాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు.

## జిల్లా జడ్జిల బదిలీ

కోర్టుచౌరస్తా, ఏప్రిల్ 15: రాష్ట్రవ్యాప్తంగా 38 మంది జిల్లా, అదనపు జిల్లా జడ్జిలను బదిలీ చేస్తూ హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి ప్రతిమ జనగాం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఈ స్థానంలో హైదరాబాద్ కమర్షియల్ డిస్ప్యూట్ స్పెషల్ కోర్టు జడ్జి ఎస్ శివకుమార్ రానున్నారు. కరీంనగర్ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఏ కుమార్ వివేక్ ఆదిలాబాద్ ఏసీబీ కోర్టుకు బదిలీ అయ్యారు. ఈ స్థానంలో మేడ్చల్ మల్కాజిగిరి పోక్సో స్పెషల్ జడ్జి జే విక్రమ్ రానున్నారు. కరీంనగర్ ఫ్యామిలీ కోర్టు జడ్జి లక్ష్మీకుమారి ఆదిలాబాద్ ఫ్యామిలీ కోర్టుకు బదిలీ కాగా, ఈ స్థానంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి జె కవిత రానున్నారు.

## నేడు కొనుగోలు కేంద్రాల ప్రారంభం

గంగాధర, ఏప్రిల్ 15 : గంగాధర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరై కేంద్రాలను ప్రారంభిస్తారని, కార్యక్రమంలో సింగిల్ విండో పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# పారిశుధ్యం.. అస్తవ్యస్తం

- నగరంలో చెత్తతో నిండుతున్న రోడ్లు
- సమీక్షలతోనే సరి పెడుతున్న ఉన్నతాధికారులు



సుభాష్‌నగర్‌లో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

కార్పొరేషన్, ఏప్రిల్ 15: నగరంలోని అనేక ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా చెత్త పేరుకుపోతున్నది. ముఖ్యంగా చెట్ల వ్యర్థాలు, భవన నిర్మాణాల వ్యర్థాలు, ఇతర వ్యర్థాలు రోడ్ల పక్కన రోజుల తరబడి ఉంటున్నాయి. వాటిని తొలగించే విషయంలో పారిశుధ్య విభాగం సిబ్బంది పూర్తిగా నిర్లక్ష్యం చూపుతున్నారు. నగరంలోని హనుమాన్‌నగర్, వావిలాలపల్లి, విద్యానగర్, భాగ్యనగర్, సప్తగిరికాలనీ, రాంనగర్, తిరుమలనగర్, రాంపూర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై చెత్త పేరుకుపోతున్నది. కేవలం కేంద్రం చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రక్రియ జరిగే రెండు నెలలు మాత్రమే హడావుడి చేస్తున్న అధికారులు, అనంతరం పారిశుధ్యాన్ని పట్టించుకున్న పాపాన పోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

***కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య పనులు అస్తవ్యస్తంగా మారాయి. వార్డు అధికారుల పర్యవేక్షణ కరువవడంతో పలు ప్రధాన రహదారులు, నివాస ప్రాంతాలు, ఫుట్‌పాత్‌లు చెత్త కుప్పలతో నిండిపోయి కనిపిస్తున్నాయి. ఇంటింటి నుంచి చెత్త సేకరించాలంటూ ఉన్నతాధికారులు కేవలం సమీక్షలతోనే సరిపెడుతుండగా, క్షేత్రస్థాయిలో వారి ఆదేశాలు అమలు కావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.***

***డివిజన్‌కో అధికారి.. ఫలితమేది?***

నగరాన్ని 66 డివిజన్లుగా విభజించగా, ప్రతి డివిజన్‌కు ఓ వార్డు ఆఫీసర్, జవాన్ ఉన్నారు. అయినా ఆయా డివిజన్ల పరిధిలోని రోడ్లపై ఉన్న చెత్తను తొలగించే విషయంలో మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రతి రోజూ ఉదయం ఆయా డివిజన్లలో పర్యటించి రోడ్లపై ఉన్న చెత్తను తొలగించాల్సిన జవాన్లు ఆ పనులు చేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. కాగా, మరోవైపు తాము పారిశుధ్య అధికారులకు చెబుతున్నా సకాలంలో పారిశుధ్య ట్రాక్టర్లు రాకపోవడం వల్లే చెత్త పేరుకుపోతున్నదని పలువురు జవాన్లు పేర్కొంటున్నారు. ప్రజలకు తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని చెబుతున్న అధికారులు, చెత్త సేకరిస్తున్న ఆటోల్లో ఆ మేరకు ఏర్పాట్లు చేయించే విషయాన్ని పూర్తిగా మరిచిపోతున్నారు. ఇక నగరంలో ఏర్పాటు చేసిన వర్మి కంపోస్టు కేంద్రాలు నామమాత్రంగా పని చేస్తుండగా.. డీఆర్‌సీసీ కేంద్రాలు సైతం చెత్తతో నిండిపోతున్నాయి. మరోవైపు కొండలా ఉన్న డంప్ యార్డు బయోమైనింగ్ పనులు కూడా నత్తకు నడక నేర్పినట్లుగా సాగుతున్నాయి. స్మార్ట్‌సిటీలో వచ్చిన వేస్ట్ మేనేజ్‌మెంట్ నిధులు సైతం నిరుపయోగంగా మారుతున్నాయి.

### పనులపై పర్యవేక్షణ కరువు

డివిజన్లలో సాగుతున్న పనుల విషయంలో పర్యవేక్షణ చేయాల్సిన ఆయా విభాగాల అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. నగరంలో ప్రతి 20 డివిజన్లకు ఒక అధికారికి పర్యవేక్షణ బాధ్యతలు ఇచ్చారు. వీరు ముఖ్యంగా ఆయా డివిజన్లలో కార్మికులు, జవాన్ల పనితీరుపై పర్యవేక్షణ చేయాలి. కానీ, వీరు ఏ రోజు కూడా డివిజన్లలో పర్యటించిన దాఖలాలు కనిపించడం లేదు. నగరపాలక సంస్థ కీలక, ఉన్నతాధికారుల ముందు మెప్పుకోసం ప్రయత్నాలు చేయడం తప్ప క్షేత్రస్థాయిలో పనులు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. 20 డివిజన్ల ఇన్‌చార్జీలకు ఇప్పటికి కూడా కనీసం తమ పరిధి ఏ మేరకు ఉన్నదన్న విషయంలో అవగాహన కూడా లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఉదయం, సాయంత్రం జవాన్లతో ఫోన్‌లో మాట్లాడడం తప్ప క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిస్థితులను తెలుసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పారిశుధ్య పనుల విషయంలో నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు పదే పదే సమీక్షలు పెట్టడం తప్ప.. ఆయా డివిజన్ల పర్యవేక్షణ బాధ్యులు ఏ మేరకు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారన్న విషయాన్ని పట్టించుకోవడం లేదు. ఈ విషయంలో ఉన్నతాధికారులు, డివిజన్ల బాధ్యులు పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయిలోకి వెళ్తే తప్ప పారిశుధ్యం మెరుగుపడే అవకాశం కనిపించడం లేదు.